క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



మాయలూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నలుగురు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో మాధవి, క్రిష్టయ్య, సుబ్బారెడ్డి, సంజీవగౌడ్‌లకు శాలువ కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, అయితే విధులను సక్రమంగా నిర్వహించి పేరు తెచ్చుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



డాక్టర్ శ్వేతాను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): డాక్టర్స్ డే సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో పలువురు పట్టణ డాక్టర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకరి ఆసుపత్రి డాక్టర్ విజైబాబు, సంజీవ నేత్రాలయం డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ జావీద్, డాక్టర్ శ్వేతలకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చింతలయ్య మాట్లాడుతూ వైద్యులు రోగులకు మానవతా దృక్పథంతో సేవలు అందించాలన్నారు. అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ఇస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్వైడీ ప్రసాద్, అభిరాం, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు.ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

తూకంలో మోసంపై తహసీల్దార్ ఆగ్రహం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ఓ రేషన్ డీలర్ లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యం తూకాల్లో చేతివాటం ప్రదర్శిస్తుండటంతో గుర్తించిన కార్డుదారులు తహసీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేశారు. 35 కిలోల బియ్యం వేయాల్సి ఉండగా 32 కిలోలు మాత్రమే వేస్తున్నారని కార్డుదారులు వాపోయారు. తహసీల్దార్ స్పందించి వీఆర్ఓను పిలిపించి విచారణ చేశారు. మరోసారి ఇలాంటి తప్పు జరిగితే డీలర్‌షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మరో ఇద్దరు డీలర్లు కూడా తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

లిక్కర్ బాటిళ్ల స్వాధీనం

బండి ఆత్మకూరు: మండలంలోని పరమటూరు గ్రామానికి చెందిన మీనిగ జలపతి నుంచి 15 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

తమ్మడపల్లెలో చోరీ

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో సోమవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సులోచన, కుమార్తెలు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.4వేల నగదుతో పాటు బియ్యం బస్తాను ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు సులోచన వాపోయింది.

నేడు యాగంటిలో బహిరంగ వేలం

బనగానపల్లె రూరల్: మండలంలోని ప్రసిద్ధ యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో రక్షాధారాలు, రుద్రాక్షమాలలు, కరుంగలి మాలలు, పూసలమాలలు, రాగి కడియాలు అమ్ముకునే హక్కుల కోసం బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి మంగళవారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచిన వారు ముందుగా రూ.50,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. బహిరంగ వేలం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, ఆసక్తి కలిగిన వ్యక్తులు హాజరుకావాలని సూచించారు.

ఎన్నో మార్గాలు..ఎంపికే కీలకం!

ఇంటర్ తర్వాత కోర్సులపై అవగాహన అవసరం

- మూడు, నాలుగేళ్లు కష్టపడితే ఆనందమయ జీవితం
- సంప్రదాయ డిగ్రీ కోర్సులతోనూ ఉపాధి
- కోర్సు ఎంపికలో ఆసక్తి, నైపుణ్యం, అభిరుచి ప్రధానం



ఇంటర్ తర్వాత సరైన మార్గాన్ని ఎంచుకోవాలి. ఎందుకంటే ఇది జీవితాన్ని మలుపు తిప్పే దశ. ఒకవైపు సాధారణ డిగ్రీ కోర్సులు..మరోవైపు ప్రొఫెషనల్ కోర్సులు. అన్నీ విలువైనవే. అయితే, ఆ దారి మీకు సరిపోతుందా అని పరిశీలించడం ముఖ్యం. తల్లిదండ్రులు, స్నేహితుల ఒత్తిడి మేరకు నిర్ణయం తీసుకోకుండా ఆసక్తి, నైపుణ్యం, అభిరుచి వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని కోర్సును ఎంచుకుంటే భవిష్యత్తు ఆనందంగా ఉంటుంది. ఈ ఏడాది జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 9,078 మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షల్లో 2,264 మంది పాస్ అయ్యారు. వీరు ప్రస్తుతం అందుబాటులో ఉన్న కోర్సులపైనా అవగాహన పెంచుకుంటే ఎందులో చేరాలో సులువుగా నిర్ణయించుకోవడానికి అవకాశం ఉంటుంది. –నంద్యాల(న్యూటౌన్)

మెడిసిన్.. : ఇంటర్‌లో బైపీసీ చదివేవారు వైద్య విద్య అభ్యసించేందుకు అవకాశముంది. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్ సీటు లభిస్తుంది. వైద్య విద్య పూర్తి చేసిన వారికి ప్రభుత్వ వైద్యులుగా ఉద్యోగం పొందే అవకాశాలు అధికంగా ఉంటాయి. బీడీఎస్ పూర్తి చేసిన దంత వైద్యులుగా స్థిరపడవచ్చు.

సీఏ : చార్టర్డ్ అకౌంటెంట్ మంచి ఉపాధినిచ్చే కోర్సు. ఇంటర్ తరువాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. దీనిలో అర్హత సాధించి, ఐపీసీసీఏలో చేరవచ్చు. ఇది నాలుగున్నర సంవత్సరాల కోర్సు.

కామర్స్ కోర్సులు : బ్యాచిలర్ ఆఫ్ కామర్స్‌ను బీకాం ఆనర్స్ అని కూడా పిలుస్తారు. ఇంటర్‌లో కామర్స్ చదివిన విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. కేంద్ర, రాష్ట్ర విశ్వ విద్యాలయాల్లో బీకాం ప్రవేశానికి సీయూఈటీ పరీక్ష రాయాల్సి ఉంటుంది. బ్యాంకింగ్, బీమా రంగాల్లో కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే విద్యార్థులు బీకాం అకౌంటింగ్, టాక్సేషన్ తీసుకోవాలి. బీకాం కోర్సు పాఠ్యాంశాల్లో ఇండియన్ టాక్స్ సిస్టమ్ ఫైనాన్షియల్ అకౌంటింగ్ వ్యాల్యూ యాడెడ్ ట్యాక్స్, సెంట్రల్ టాక్స్, ప్రొసీజర్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బిజినెస్ కమ్యూనికేషన్ ఉంటాయి. బీబీఏ,సీఏ, సీఎస్ తదితర వృత్తి కోర్సులు చదవడానికి వీలుంది.

ఇంజినీరింగ్ : జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ఏపీఈఏపీ సెట్‌లో ఇంజినీరింగ్ కోర్సులకు ప్రాధాన్యత అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్, ఈఈఈ, ఏఈ, ఐటీ తదితర కోర్సులు ఉన్నాయి. ఐఐటీ ఎన్ఐటీలో చేరి ఇంజినీరింగ్ చేస్తే డిగ్రీ పూర్తయ్యేలోగా వివిధ కంపెనీల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. మన రాష్ట్రంలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అవకాశాలు వస్తున్నాయి.

ఫార్మసీకి ప్రాధాన్యం...

ఔషధ రంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అవకాశాలు విస్తృతంగా ఉంటాయి ఏపీ ఈఏపీసెట్‌తో బీ-ఫార్మసీ ప్రవేశాలు జరుగుతాయి. ఇది పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, హాస్పిటల్ ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు లభిస్తాయి.

వ్యవసాయం, ఉద్యానం..

ఏపీ ఈ ఏపీసెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ చదివే అవకాశం ఉంది. నాలుగు సంవత్సరాల ఈ కోర్సులు పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి మార్గాలు ఎక్కువగా ఉన్నాయి.

నర్సింగ్‌తో స్వయం ఉపాధి..

ఇంటర్ బైపీసీ విద్యార్థులకు నర్సింగ్ చక్కని అవకాశం. ఈ కోర్సుతో స్వయం ఉపాధి పొందడమే కాకుండా రోగులకు సేవ చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్ తరువాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే మహిళలకు మంచి అవకాశాలు ఉంటాయి. రెండేళ్ల ఫిజియోథెరపీ కోర్సులూ అందుబాటులో ఉన్నాయి.

ఫైన్‌ఆర్ట్స్‌తో ఉజ్వల భవిత...

పెయింటింగ్, శిల్పకళ, ప్రింట్ మేకింగ్, విజువల్ కమ్యూనికేషన్, ఫొటోగ్రఫీ, గ్రాఫిక్ డిజైన్, ఆర్ట్ హిస్టరీ తదితర విభాగాల్లో శిక్షణ పొందడానికి ఫైన్ ఆర్ట్స్ కోర్సులు ఉపకరిస్తాయి. ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన అనంతరం విద్యార్థులు గ్యాలరీలు, మ్యూజియం, మీడియా సంస్థలు, విద్యారంగం తదితర రంగాల్లో ఉద్యోగాలు పొందడానికి వీలుంటుంది.

డిగ్రీతో బోలెడు అవకాశాలు

సీయూ సెట్ రాసి, జాతీయ స్థాయిలో ప్రాధాన్యం గల విశ్వవిద్యాలయాల్లో హ్యూమన్ సైన్సు కోర్సులు చదవచ్చు. మన రాష్ట్రంలో బీఏతో పాటు బీకాం జనరల్ కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉంది. బీఎస్సీ కంప్యూటర్ కోర్సుకు కూడా డిమాండ్ ఉంది. డిగ్రీ చదివే విద్యార్థులకు నైపుణ్యాల పెంపుపై వివిధ వర్సిటీలు దృష్టి సారించాయి. ఇప్పుడిప్పుడే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో డిగ్రీచదివే విద్యార్థులు కూడా అవకాశాలు పొందుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలనుకునేవారు డీఈడీ పూర్తి చేసి అవకాశాలు పొందవచ్చు. న్యాయవాద వృత్తిలో స్థిర పడాలనుకునే విద్యార్థులు ఐదేళ్ల కోర్సు ప్రవేశ పరీక్షలు రాసి న్యాయ విద్యను అభ్యసించవచ్చు.

డిగ్రీ కోర్సులతో ఉపాధి



ఇంటర్ తర్వాత డిగ్రీ కోర్సులతో ఉపాధి పొందడానికి వీలుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎంప్లాయిబిలిటీ కోర్సులు ఉన్నాయి. వీటికి డిమాండ్ పెరుగుతోంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులతో పాటుగా ఆక్వా కల్చర్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులను కలిపి డిగ్రీ చేసుకునే అవకాశం ఉంది.

– శశికళ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నంద్యాల

కలుపు యాజమాన్యం ముఖ్యం



నగళ్లపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: మొక్కజొన్న పంట సాగులో కలుపు యాజమాన్యం ముఖ్యమని చాగలమర్రి ఏఓ రంగనేతాజి సూచించారు. ఆయన మంగళవారం నగళ్లపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మొక్కజొన్న పంట సాగులో కలుపు నివారణపై అవగాహన కల్పించారు. కలుపు నివారణ పద్ధతులు పాటించకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శ్రావణి, మణి గ్రామ రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

బండిఆత్మకూరు: భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని ఏడీ ఆంజనేయ సూచించారు. మండలంలోని పెద్దదేవలాపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏడీ ఆంజనేయ, డీఆర్‌సీఏడీ చెన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోవడంతోపాటు దిగుబడలపై ప్రభావం చూపుతుందన్నారు. గుర్తింపు పొందిన దుకాణాల్లోనే నాణ్యమైన విత్తనం కొనుగోలు చేయాలన్నారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపు పత్రాలను అందజేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించి రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసి పంటను బెట్ట నుంచి కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



అష్టాదళ పాదపద్మారాధన సేవలో శ్రీకాళికాంబాదేవి



ప్రత్యేక అలంకరంలో శ్రీనాగవారాహి అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని కాళికాంబాదేవికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రులు

పట్టణంలోని హరిజన వాడలో వెలసిన శ్రీ నాగవారాహి శక్తి పీఠంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని 6వ రోజు మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారికి సారె సమర్పణ



సారె సమర్పణకు తెలంగాణ నుంచి వచ్చిన భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ మాతకు ఆషాడ మాసోత్సవాన్ని పురస్కరించుకొని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలచే అభిషేకాలు చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారి ప్రతిమను, గండా దీపాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహామంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యు లు భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

సుంకులాపరమేశ్వరికి సారె సమర్పణ

పట్టణంలోని పప్పుల బట్టి బజార్‌లో వెలసిన శ్రీసుంకులాపరమేశ్వరి దేవికి మంగళవారం వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు ఇందుమతి, శోభారాణి ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సారెను అమ్మవారి శాల నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైద్యులు మానవతా దృక్పథంతో సేవలు అందించాలి



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(అర్బన్): వైద్యులు రోగులకు మానవతాదృక్పథంతో సేవలు అందించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తిరుమల పునీత్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు.వైద్య సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాల నిర్వహణ కోసం ఐఎంఏ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. నంద్యాలలో స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్య సేవ లు అందించేందుకు వైద్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్, హరిత, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రవికృష్ణ, మధుసూదనరావు, కల్లూరి రామలింగారెడ్డి, కందుకూరి శ్రీరామమూర్తి, చిన్నపురెడ్డి, వివేకానందరెడ్డి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామానికి చెందిన వేదావతి(38) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ మేరి తెలిపిన వివరాలు.. గత మార్చిలో భర్త చెన్నయ్య లష్కర్ ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త ఉద్యోగం భార్య వేదావతికి ఇచ్చారు. అయినా జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లోనే గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి డాక్టర్లు ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

సాగునీరు అందించి ఆదుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

రుద్రవరం: శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నంద్యాల జిల్లాలోని వెలుగోడు, గోరుకల్లు, రిజర్వాయర్లతో పాటు తెలుగుగంగ, ఎస్సార్‌బీసీ కాలువలకు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చిన్నకంబలూరు గ్రామ రైతులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులైందని సరిగ్గా వర్షాలు లేకపోవడంతో పంట సాగు చేసుకోవడం ప్రశ్నార్థకంగా మారిందనానరు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని నీరు విడుదల చేయాలని లేదంటే ఈనెల 4న జిల్లా రైతాంగంతో కలిసి పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తుతామని హెచ్చరించారు. శ్రీశైలం రిజర్వాయరులో నీటి మట్టం 854 అడుగులు దాటితే కృష్ణా జలాలను వాడుకునే హక్కు ఉందని, ప్రస్తుతం అక్కడ నీటి మట్టం 872 అడుగులకు చేరిన ప్రభుత్వం పట్టించుకోక పోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇలా నిర్లక్ష్యం చేయడం ద్వారానే రాయలసీమ జిల్లాల రైతాంగానికి ఏటా తీవ్రం అన్యాయం జరుగుతోందని వాపోయారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఈనెల 3వ తేదీలోగా నీటిని వదిలేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

రైతుల ధర్నాను విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): తుంగభద్ర ఎగువ, దిగువ కాల్వలకు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తక్షణమే నీరు విడుదల చేయాలని కోరుతూ కర్నూలు జల వనరుల శాఖ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించే ధర్నాలో రాయలసీమ రైతులు, అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తుంగభద్ర ఎగువ, దిగువ కాల్వలకు నీటిని విడుదల చేయకుండా డ్యాం నుంచి నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారన్నారు. జూన్ 22 నాటికే శ్రీశైలం రిజర్వాయర్ నీటి మట్టం 854 అడుగులకు చేరినా సీమ ప్రాజెక్టులకు నీటి విడుదల లేదన్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండు దశకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

5న మండల మీట్

దొర్నిపాడు: ఈనెల 5న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరు కావాలని కోరారు.

జిల్లాలో ప్రశాంతగా డీఎస్సీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం ఎకనామిక్స్, ఇంగిష్, ఎస్‌జీటీ పరీక్షలు జరిగినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 695 మంది అభ్యర్థులకు గాను 682 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 695 మందికి గాను 689 మంది విద్యార్థులు హాజరు కాగా 6 మంది గైర్హాజరయ్యాని చెప్పారు.

చెరువులకు నిధులు మంజూరు

శిరివెళ్ల: మండలంలోని చెరువులకు నిధులు మంజూరయ్యాయని ఎంఐఎం ఏఈ రఘురాముడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక నాగుల చెరువు, చెన్నూరు– ఇసుకపల్లె చెరువులకు ఒకొక్క దానికి రూ. 5.30 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. నిధులతో చెరువులకు నీరు వచ్చే మార్గాలు, తూముల అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. అలాగే స్థానిక నాగుల చెరువు మరింత అభివృద్ధికి రూ. కోటి ప్రతి పాదనలు పంపామన్నారు.

బూట్లు, బెల్టులు మంజూరు

శిరివెళ్ల: డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణ విద్యా కిట్టు కింద మండలానికి బూట్లు, బెల్టులు, లైబ్రరీ బుక్స్ మంజూరయ్యాయని ఏంఈఓ నాగార్జునరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు 4,732 మంది విద్యార్థులు చదువుతున్నారని వారందరికీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందచేస్తున్నామన్నారు.

నేడు భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా

నంద్యాల(అర్బన్): ముందస్తు కురిసిన వర్షాలతో పంటలు వేసుకున్న రైతులను కాపాడాలని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి భూపాల్‌రెడ్డి, అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో 860 అడుగులు వారం కిందటే దాటిన సందర్భంగా పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల చేయాలని, సుంకేసుల నుంచి కేసీ కెనాల్‌కు తక్షణమే నీటి విడుదల చేసిన రైతులను ఆదుకోవాలన్నారు. ఆలస్యమైతే పంటలుసాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ అంశాలపై బుధవారం జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లా రైతులందరూ హాజరుకావాలని కోరారు.

ఉపాధిలో ప్రగతి లక్ష్యాలు సాధించాలి

- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రగతిలో నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉపాధి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ ద్వారా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. లేబర్ మొబిలైజేషన్‌లో భాగంగా ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిని తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఇందులో భాగంగా పండ్ల తోటల పెంపకం, లేబర్ టార్గెట్, సరాసరి దినసరి వేతనం, ఫారం పాండ్స్, సోక్ పిట్స్, నాడేప్ కంపోస్ట్ పిట్, కమ్యూనిటీ సోక్ పిట్స్ తదితర అంశాల్లో మండలాల వారీగా ప్రగతిపై సమీక్షించారు. వెనుకబడిన మండలాల అధికారులతో కారణాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎంఅండ్ఈ భాస్కర్ నాయుడు, ఏపీడీలు నరసింహారెడ్డి, సాంబశివరావు, అన్వరా బేగం, కోర్సు డైరెక్టర్లు ఏసుదాస్, పరమేశ్వరుడు, ఇస్మాయిల్, ఏపీఓలు, ఈసీలు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పీఎం సూర్య ఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం కింద వందమందికి సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ఆ బ్యాంకు మంజూరు ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం సాయంత్రం ఆ లబ్ధిదారులతో కలిసి ఎస్‌బీఐ అధికారులు స్థానిక కలెక్టరేట్లోని చాంబర్‌లో కలెక్టర్ రాజకుమారిని కలిశారు. ఇందుకు సంబంధించిన బ్యాంకు మంజూరు ఉత్తర్వులను లబ్ధిదారులకు కలెక్టర్‌చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్ఎం వెంకట సూర్య ప్రకాష్, బ్రాంచ్ మేనేజర్ శేషు, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలింపియన్ అర్షద్ షేక్‌కు అభినందన

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించిన నంద్యాల వాసి, పారా ఒలింపియన్ అర్షద్ షేక్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి అభినందించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఎస్‌డీఓ రాజు ఆధ్వర్యంలో అర్షద్ షేక్ జిల్లా కలెక్టర్‌ను కలిశారు. జాతీయస్థాయిలో బాడీ బిల్డింగ్, ఆర్చరీ, స్విమ్మింగ్, ట్రైతలాన్, వీల్ చైర్ ఫెన్సింగ్ తదితర పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంపై దుష్ప్రచారం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానం విక్రయిస్తున్న లడ్డూ ప్రసాదంలో బొద్దింక వచ్చినట్లు ఆరోపించిన వ్యక్తి దేవస్థానంపై దుష్ప్రచారం చేశారని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం దేవస్థానం ఈఓ లడ్డూ ప్రసాదంలో బొద్దింక విషయంపై వీడియో రూపంలో వివరణ ఇచ్చారు. 'గత నెల 29న స్వామి అమ్మవార్ల దర్శనానికి నెల్లూరు జిల్లా కావలికి చెందిన కె.శరత్ చంద్ర, ముగ్గురు స్నేహితులతో కలిసి వచ్చారు. దర్శనం అనంతరం లడ్డూ కౌంటర్ వద్ద ప్రసాదాలు కొనుగోలు చేసి, లడ్డూలో బొద్దింక వచ్చినట్లు ఆరోపించి, ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారితో కమిటీ వేసి విచారణకు ఆదేశించాం. భక్తుడు ఆరోపించినట్లు లడ్డూలో బొద్దింక కాదని మిడత రకానికి చెందిన క్రిమి. లడ్డూ పాకం 100 డిగ్రీల వేడిలో తయారు చేస్తారు. ఆ వేడిలో ఏదైనా క్రిమి కీటకాలు పడితే వాటి శరీరం అవయవాలు గుర్తించడానికి వీలు పడదు. కానీ భక్తుడు ఇచ్చిన లడ్డూలో ఉన్న మిడత చనిపోయినా, దాని శరీర అవయవాలు అన్నీ అలాగే ఉన్నాయి. దీన్ని బట్టి పరిశీలిస్తే దేవస్థానాన్ని పథకం ప్రకారం అప్రతిష్ట పాలు చేయాలని చేసినట్లు నిర్ధారణకు వచ్చాం. వారిపై శ్రీశైలం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. భక్తులు ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మవద్దు' అని ఈఓ స్పష్టం చేశారు.

రూ.4 వేలు కట్టకపోతే కుళాయి కనెక్షన్ కట్

- డిపాజిట్లు చెల్లించాలని రుద్రవరం ఈఓ ఒత్తిడి
- బెంబేలెత్తుతున్న పేదలు



రుద్రవరం బెస్త కాలనీలో కుళాయి కట్ చేసి బిరడా బిగించిన దృశ్యం



మేజర్ పంచాయతీ ఈఓతో వాదిస్తున్న బెస్త కాలనీ వాసులు

రుద్రవరం: కూటమి పాలనలో పేదలను బాదుతున్నారు. కుళాయిలకు తాగునీటి సరఫరా చేసేందుకు కూడా రూ. 4 వేలు డిపాజిట్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. స్పందించకపోతే కనెక్షన్ కట్ చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారు. ఎప్పుడు తీసుకున్న కుళాయి కనెక్షన్‌కు ఇప్పుడెందుకు డిపాజిట్ చెల్లించాలని పేదలు ప్రశ్నిస్తున్నారు. రుద్రవరం మేజర్ పంచాయతీలో 500 ఇంటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. దాదాపు 20 ఏళ్ల క్రితం అప్పటి రూల్స్ ప్రకారం స్థానికులు డిపాజిట్లు చెల్లించి ఆ కనెక్షన్లు తీసుకున్నారు. నాటి నుంచి ఏటా ఇంటి పన్నుతో పాటు కుళాయి పన్ను కూడా చెల్లిస్తున్నారు. అయితే, మేజర్ పంచాయతీ ఈఓగా వచ్చిన సుబ్బరావు ఈఓఆర్డీగా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఈయన పంచాయతీ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి కుళాయి కనెక్షన్ ఉందా, ఉంటే అందుకు సంబంధించిన డిపాజిట్ రశీదు చూపించాలని లేదంటే కొత్తగా రూ.4వేలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాడు. లేదంటే కనెక్షన్ కట్ చేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికే బెస్త కాలనీలో పలువురి కుళాయిలకు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో కుళాయి వినియోగదారులకు దిక్కుతోచడం లేదు. తాము కనెక్షన్ తీసుకునే సమయంలోనే చెల్లించామని, ఇప్పుడు అందుకు సంబంధించిన రశీదులు చూపించమంటే ఎక్కడి నుంచి తీసుకురావాలని ప్రశ్నిస్తున్నారు. అంత డబ్బు తమ వద్ద లేదని కొందరు వాపోతున్నారు. రుద్రవరం మేజర్ పంచాయతీ మజరా తువ్వపల్లెలో కూడా ఇదేవిధంగా కుళాయి కనెక్షన్‌లకు డిపాజిట్లు చెల్లించాలని ఈఓ వెళ్లగా అక్కడి గ్రామ ప్రజలు తిరగబడ్డారు. కాగా డిపాజిట్ల విషయంపై ఈఓ సుబ్బరావు వివరణ కోరగా డిపాజిట్ డబ్బు గ్రామంలో అభివృద్ధి పనులకు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.